క్లుప్తంగా

షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలి

ఏటూరునాగారం: ములుగు వెలుగు యాప్‌లో అటెండెన్స్ మార్క్ చేయలేదని పలువురు ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొండ చెంచయ్య, అధ్యక్షుడు రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పలువురు ఉపాధ్యాయులు బడిబాట విధులకు హాజరైనప్పటికీ వేసవి సెలవుల అనంతరం మొదటి రోజు అయినందున యాప్‌లో అటెండెన్స్ మార్క్ చేయలేదన్నారు. విధులకు హాజరైన ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం సరైంది కాదు అన్నారు. ఉపాధ్యాయుల మానసిక స్థైర్యం దెబ్బతింటుందని, షోకాజ్ నోటీసు లిస్ట్‌లో ఉన్న చాలా మంది ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఏటూరునాగారం మండలంలో మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. షోకాజ్ నోటీసులు రద్దు చేయాలన్నారు.

పనులు ప్రారంభం



వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో సర్పంచ్ పాయం జయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రహదారి పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతు



వాజేడు: మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు ఆదివారం మరమ్మతులు చేశారు. మండల పరిధిలోని కాచారం వద్ద పైప్‌లైన్ లీకై తాగు నీరు వృథాగా పోతుంది. దీంతో సంబంధిత శాఖ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు.

కానిస్టేబుళ్లకు సత్కారం



టేకుమట్ల: దశాబ్ది ఉత్సవాల్లో సురక్ష దివాస్‌లో భాగంగా భూపాలపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉత్సవాల్లో ఎస్పీ సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా విధుల్లో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లకు సత్కారాన్ని అందజేశారు. వారిలో టేకుమట్ల పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్ వర్టికల్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా కానిస్టేబుల్ బయగాని రంజిత, రేగొండలో ఇటీవల ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోగా అతనికి సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడిన రేగొండ కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, రేగొండలో ఒక వ్యక్తి హత్య, జీవిత ఖైదు కేసులో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన మహిళా కానిస్టేబుల్ జ్యోతిలు ఈ సత్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి టేకుమట్ల, రేగొండ పోలీసులు అభినందనలు తెలిపారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

శాయంపేట : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని టీపీసీసీ సభ్యుడు, ఆ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కర్ణాటక ఫలితాలు పునరావృతమౌతాయని స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఎస్‌వీకేకే ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే దేశంలో, రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలూ వంచనకు గురవుతున్నారని తెలిపారు. వైనాల కుమారస్వామి, మహ్మద్ రఫీ, దుబాసి కృష్ణమూర్తి, మారెపెల్లి సాంబయ్య, రఫీ, నిమ్మల రమేష్ ఉన్నారు.

ఆడుకోవడం ఎలా?

- అందుబాటులోకి రాని క్రీడా ప్రాంగణాలు
- పలుచోట్ల బోర్డుల ఏర్పాటుకే పరిమితం
- వసతుల కల్పనలో నిర్లక్ష్యం



వెంకటాపురం(కె)లో బోర్డుకే పరిమితమైన క్రీడామైదానం

ఎస్ఎస్ తాడ్వాయి: జిల్లా వ్యాప్తంగా సీఎం కప్ నిర్వహణతో కొన్ని రోజుల పాటు పండుగ వాతావరణం నెలకొంది. మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలపై పట్టింపు కరువైంది. వసతుల లేమితో, గ్రామాలకు దూరంగా అటవీ ప్రాంతాలలో స్థలాలు కేటాయించడంతో యువత మైదానాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క మండలంలోని పూర్తిస్థాయిలో వసతులతో మైదానాలు అందుబాటులోకి తీసుకురాలేదు. జిల్లాలో గ్రామ పంచాయతీలు 174, అనుబంధ గ్రామాలు 117, 190 క్రీడామైదానాలు ఏర్పాటు చేయగా ఇంక 154 క్రీడా మైదానాలకు స్థల సేకరణ చేశారు.



పై ఫొటో మంగపేట మండలంలోని రాజుపేట గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన క్రీడామైదానం బోర్డుకే పరిమితమైంది. మైదానంలో ఆటలు ఆడుకునేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. క్రీడాకారులకు వినియోగంగా లేకపోవడంతో ఆటలకు నోచుకోవడం లేదు. దీంతో క్రీడామైదానం పిచ్చిమొక్కలు పెరిగి దర్శనమిస్తుంది. మైదానానికి వచ్చే యువతకు బోర్డులు మాత్రమే దర్శనమిస్తున్నాయి తప్ప సౌకర్యాలు శూన్యం.

రూ.4 లక్షలతో ఏర్పాటు..

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నుంచి క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు రూ.4 లక్షల వరకు వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నిధులతో క్రీడా పరికరాల ఏర్పాటు, మైదానం చదును, బాస్కెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, లాంగ్‌జంప్, హైజంప్ వంటి క్రీడలకు సంబంధించిన కోర్టులు ఏర్పాటు చేయాలి. మైదానం చుట్టూ మొక్కలు నాటాలి. కాని క్షేత్రస్థాయిలో క్రీడా ప్రాంగణాలు పరిశీలిస్తే ఎలాంటి సౌకర్యాలు కానరావడం లేదు. కొన్ని చోట్ల స్థలాల కొరత ఉన్నప్పటికీ, కొన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు చెట్ల పొదలు, గుట్టలు, బండలతో దర్శనమిస్తున్నారు. క్రీడా ప్రాంగణాల



పై ఫొటోలో కనిపిస్తున్నది గంగారం గ్రామ పంచాయతీలో అన్నారం చెరువు వద్ద ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం. ఈ ప్రదేశంలో గుట్టతో పాటు పెద్ద పెద్ద బండ రాళ్లు ఉండటంతో క్రీడా మైదానానికి అనుకూలం ఏ మాత్రం కాదు. కాని అధికారులు చూపించిన ఈ స్థలంలో క్రీడామైదానం పేరుతో కేవలం బోర్డు మాత్రమే ఏర్పాటు చేశారు. ఈ క్రీడామైదానంలో భూమి చదును లేక మొత్తం బండ పర్చుకొని ఉండటంతో ఆటలకు వినియోగంలోకి రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల ఇలాంటి పరిస్థితే నెలకొంది.

ఏర్పాట్ల వసతుల పై దృష్టి సారించాలని గ్రామాల్లోని క్రీడాకారులు కోరుతున్నారు.

యువత క్రీడలకు దూరం..

గ్రామాల్లో ఆట స్థలాలు లేకపోవడంతో యువత క్రీడలకు దూరమవుతున్నారు. గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం క్రీడాకారుల పాలిట శాపంగా మారుతుంది. స్థలాల కొరత పేరుతో గ్రామాలకు దూరంగా క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా వేసవిలో క్రీడాకారులు పంట చేళ్లను, ఖాళీ ప్రదేశాలను మైదానాలుగా మార్చుకొని ఆడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం క్రీడా మైదానాల పై దృష్టి సారించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఘనంగా పోలీస్ సురక్షా దివస్



ర్యాలీ నిర్వహిస్తున్న 5వ బెటాలియన్ పోలీసులు

ములుగు రూరల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సురక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం గోవిందరావుపేట మండలం చల్వాయి పరిధిలోని తెలంగాణ స్పెషల్ పోలీస్ 5వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పెదబాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పని తీరును వివరించారు. ప్రజలకు పోలీసులు అందిస్తున్న సేవలను తెలిపారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఆర్ఐలు కార్తీక్, అన్నయ్య, రాంప్రసాద్, ఆర్ఎస్సైలు రంజిత్‌రెడ్డి, రంజిత్ కుమార్, గణేష్, ఇతర సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు.

మొగుళ్లపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్‌సీసీ అధికారి రాజయ్య అన్నారు. ఆదివారం మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్‌సీసీ విద్యార్థులకు పరిసరాల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో వీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రతి ఇంటిలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉందని దానిని నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహాస్వామి, గ్రామ సర్పంచ్ నరహరి పద్మ , ఎంపీటీసీ కల్పన, ఉప సర్పంచ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనం ముస్తాబు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామ పంచాయతీ గదుల ఆధునీకరణ పూర్తయి సోమవారం(నేడు) ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. రూ.10లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గదుల ఆధునీకరణ ప్రస్తుతం అన్ని హంగులతో పూర్తయింది. ప్రస్తుతమున్న పంచాయతీ భవనంలో మరింతగా సర్పంచ్, కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్, వార్డుసభ్యుల సమావేశం, సందర్శకుల కోసం, నోటీస్ బోర్డు గదులను వేర్వేరుగా మార్చారు. ఆ గదుల్లో కొత్త ఫర్నిచర్, ఏసీ, ఫ్యాన్లు, కుర్చీలు, టాయిలెట్స్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేష్‌నేత, జెడ్పీచైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిల చేతుల మీదుగా కాళేశ్వరం పంచాయతీ భవనం, రూ.22లక్షలతో నిర్మించిన రైతు వేదికలను ప్రారంభించనున్నట్లు సర్పంచ్ వెన్నపురెడ్డి వసంత, కార్యదర్శి సత్యనారాయణలు వేర్వేరుగా తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, రైతులు భారీ సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన కాళేశ్వరం పంచాయతీ భవనం

నేతకాని కులస్తులను ఆదుకోవాలి



మండల కమిటీతో నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: నేతకాని కులస్తులను ప్రభుత్వ అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దీగొండ కాంతారావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తెలంగాణ నేతకాని మహర్‌కుల హక్కుల పరిరక్షణ సంఘం తాడ్వాయి నూతన మండల కమిటీ ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో అన్ని రాజకీయ పార్టీలు నేతకాని కులస్తులను గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం నేతకానిల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం మండల నేతకాని మహర్ కుల హక్కుల పరిరక్షణ కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా జాడి సంజీవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకన్న, ఉపాధ్యక్షుడిగా సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా సత్యం, సంయుక్త కార్యదర్శిగా కన్నయ్య, సహాయ కార్యదర్శిగా సతీష్, ప్రచార కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా గంగరాజు, అధికార ప్రతినిధిగా బానిస రాంబాబు, యూత్ అధ్యక్షుడిగా జాడి సాంబయ్య, బీమ్ సైనిక్ దళ్ అధ్యక్షుడిగా దుర్గం నవీన్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. సైనికుదల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, జిల్లా అధికార ప్రతినిధి దుర్గం రాజు, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహారావు, సల్లూరి లక్ష్మణ్, కోశాధికారి కాంతారావు, నాయకులు కొండగుర్ల పోచయ్య దీకొండ బాబు సునాకర్ మల్లేష్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు



గాయపడిన సదానందం

ఎస్ఎస్‌తాడ్వాయి: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని కాటాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తమ్మల సదానందం రోజు వారిలాగే కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. తేనెటీగలు దాడి చేయడంతో జారి కిందపడంతో గాయాలయ్యాయి. దీంతో తాడ్వాయి పీహెచ్‌సీలో వైద్య చికిత్సలు నిర్వహించారు. గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి



నర్సక్క (ఫైల్)

కన్నాయిగూడెం: మండలంలోని కంతనపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ చింత నర్సక్క(58) కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ.. ఆదివారం మృతి చెందింది. సర్పంచ్ మృతితో గ్రామంలో ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలికి భర్త చంద్రయ్య, కూతురు పల్లవి ఉన్నారు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించి మనోధైర్యం నింపారు.

నిఘా నేత్రాలపై నిర్లక్ష్యం!

- పనిచేయని సీసీ కెమెరాలు
- చెట్టు చాటున దర్శనమిస్తున్న వైనం

చిట్యాల: మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో గతంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు హరితహారంలో నాటిన చెట్టు చాటున దర్శనమిస్తున్నాయి. కేసులను చేధించడంలో ప్రత్యేక ప్రాత పోషించే నిఘా నేత్రాలు పనిచేయడం లేదు. కొన్ని రోజుల క్రితం పిడుగుపాటుకు కెమెరాల ఐసీలు కాలిపోవడంతో ఇప్పటి వరకు మరమ్మతుకు నోచుకోలేదు. మండల కేంద్రంలో ఉండే సీసీ కెమెరాలను కనీసం ఎవరు పట్టించుకోకపోవడంతో అలాగే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సీసీ కెమెరాలను మరమ్మతు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



చెట్టు చాటున నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్: తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ టీయూడబ్ల్యూజే ఐజేయూ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా ద్వితీయ మహాసభలను జిల్లా కేంద్రంలోని సింగరేణి కాంట్రాక్ట్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఐజేయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సామంతుల శ్యామ్, క్యాతం సతీష్ తెలిపారు. ఈ మేరకు భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితోపాటు మున్సిపల్ చైర్మన్ వెంకటరాణి సిద్దు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు జర్నలిస్టులతో కలిసి ఆదివారం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు చింతల కుమార్ యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు చందు, జాయింట్ సెక్రెటరీ చిరంజీవి, మొగుళ్లపల్లి మండల ఐజేయూ అధ్యక్షుడు రాళ్ల బండి శ్రీనివాస్, సెక్రటరీ రాజు, గణపురం మండలం నాయకులు రమేష్, సీనియర్ పాత్రికేయులు తాళ్లపల్లి సమ్మయ్య గౌడ్, రాచర్ల ప్రభాకర్ మురళి, శ్రీశైలం, సతీష్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సాంబయ్య, రజనీకాంత్, నరేందర్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

హామీలను అమలు చేయాలి

పరకాల : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గన్నోజు శ్రీనివాసాచారి డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి 'గడప గడపకు..' యాత్రను ఆదివారం ఆయన ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, వైఫల్యాలపై ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాసాచారి మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



భూపాలపల్లి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



టేకుమట్ల: గర్మిళ్లపల్లిలో..

భూపాలపల్లి: మండలంలోని అజాంనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1995–1996 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు కుటుంబసమేతంగా కలుసుకున్నారు. పాఠశాలలో ఆనందోత్సవాల నడుమ ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 27 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు కుటుంబ పరిస్థితులను పరస్పరం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు వాసుదేవ్, రాజయ్యలను పూలతో సత్కరించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల ఆహ్వానం మేరకు హాజరైన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పూర్వ విద్యార్థులందరు ఒక వేదికపై కలుసుకునేలా కృషి చేసిన గుమ్మడి సుధాకర్, శ్రీనివాస్, రవి, సురేష్, సంపత్, శ్రీదేవి, రమలకు తోటి విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ గోవిందుల శ్యాం పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 1991–92 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి, పాఠశాల అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పింగిళి నారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు గీద శ్రీధర్‌రెడ్డి, కోండ్ర రవీందర్, సోరుపాక సదానందం, స్వర్ణలత, సుమతి, అరుణ పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



విగ్రహాలతో ఊరేగింపు చేస్తున్న భక్తులు



పూజలో పాల్గొన్న జెడ్పీటీసీ గొర్రె సాగర్



పూజలో పాల్గొన్న కీర్తిరెడ్డి

చిట్యాల: మండలంలోని పాశిగడ్డతండా ప్రజలు సుఖ సంతోషాలతో, పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని బీజేపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, జెడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. ఆదివారం మండలంలోని పాశిగడ్డతండాలో శ్రీమహాలక్ష్మీ, భూలక్ష్మీ, బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు వారు వేర్వేరుగా హాజరై పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జెడ్పీటీసీ గొర్రె సాగర్ బొడ్రాయి నిర్వహణ కమిటీకి రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావుడ్య రజిత హరిభూషణ్, బీఆర్ఎస్ నాయకులు మ్యాదరి రాంచందర్, బండారి వైకుంఠం, కత్తి సతీష్, బీజేపీ మండల నాయకులు రాజు నాయక్, గోవర్ధన్, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సురక్షా దివస్‌కు తరలిన యువత



రేగొండ నుంచి తరలివెళ్తున్న యువత

టేకుమట్ల/రేగొండ: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు జిల్లా కేంద్రంలో ఎస్పీ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురక్షా దివస్‌కు టేకుమట్ల, రేగొండ ఎస్సైలు చల్ల రాజు, శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత తరలి వెళ్లారు. వారి వెంట టేకుమట్ల, రేగొండ పోలీస్ కానిస్టేబుళ్లు మధూకర్, మహేందర్, సుమన్, రంజిత, హర్షితరెడ్డి, లత, రేగొండ ఏఎస్సై ప్రభాకర్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ ప్రవీన్, కిరణ్, తిరుపతి, యువకులు పాల్గొన్నారు.